ముందు అట్లీ.. తర్వాతే త్రివిక్రమ్ సినిమా?

'పుష్ప2' హడావిడి ముగిసిన నాటినుంచి అల్లు అర్జున్ నెక్ట్స్ పని చేసేది ఏ దర్శకునితో? అనే చర్చ అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకుల్లో నడుస్తూనే ఉంది. ఈ చర్చల్లో ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు త్రివిక్రమ్, అట్లీ. నిజానిక్కూడా వీరిద్దరి కథలకూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు బన్నీ. మరి ముందు ఎవరితో? అనేదే ఇక్కడ చర్చ. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముందు అట్లీ సినిమానే ఉంటుందని తెలుస్తున్నది. నిజానికి 'జవాన్' పూర్తయిన నాటినుంచి బన్నీ కథపైనే ఉన్నారట అట్లీ. ఆ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే కంప్లీట్ అయ్యిందని, బౌండ్ స్క్రిప్ట్ రెడీగా ఉందని సమాచారం. అందుకే త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ని మొదలుపెట్టనున్నారట బన్నీ. అలాగే దర్శకుడు అట్లీకి ఆయన ఓ షరతు కూడా విధించారట. వచ్చే ఏడాది మార్చి కల్లా షూటింగ్ కంప్లీట్ అవ్వాలి అనేదే ఆ షరతు. పానిండియా సినిమా అంటూ సంవత్సరాల పొడుగునా తీస్తే కుదరని కరాఖండీగా చెప్పేశారట బన్నీ. స్క్రిప్ట్ ఇప్పటికే కంప్లీట్ అవ్వడంతో బన్నీ షరతుకు అట్లీ కూడా ఓకే చెప్పేశారట. ఈ లోపు త్రివిక్రమ్ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తిచేసుకొని, 2026 మార్చి తర్వాత సెట్స్‌కి వెళ్తుందని ఫిల్మ్ వర్గాల టాక్. ఈ సినిమాకు బన్నీ ఏడాదిన్నర డేట్లు ఇచ్చినట్టు తెలుస్తున్నది. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న పాన్ వరల్డ్ సినిమా కావడం వల్లే.. బన్నీ ఎక్కువ డేట్లు కేటాయించారన్నది ఇన్‌సైడ్ టాక్. అయితే.. వీటికి సంబంధించిన అధికారిక ప్రకటనలు మాత్రం ఇప్పటివరకూ రాలేదు. ఇందులో నిజానిజాలు ఎంతవరకో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

బ్రేకప్ వార్తలు నిజమేనా?

అగ్ర కథానాయిక తమన్నా, బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ గత రెండేళ్లుగా రిలేషన్‌లో ఉన్న విషయం తెలిసిందే. 'లస్ట్ స్టోరీస్-2' వెబ్‌సిరీస్ కోసం పనిచేస్తున్న ఈ జంట ప్రేమలో పడ్డారు. తమ లవ్‌ఎఫైర్ గురించి అనేక సందర్భాల్లో ఈ జంట మాట్లాడారు. సరైన సమయంలో పెళ్లి చేసుకుంటామని కూడా చెప్పారు. అయితే ఈ జంట మనస్పర్థల కారణంగా విడిపోయారంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. అందుకు వృత్తిపరమైన అంశాల కారణమని అంటున్నారు. కెరీర్‌కు గుడ్‌బై చెప్పి పెళ్లి చేసుకొని జీవితంలో సెటిల్ కావాలన్నది తమన్నా ఆలోచనగా ఉందని, విజయ్‌వర్మ మాత్రం పెళ్లి ప్రస్తావన లేకుండా మరికొంతకాలం నటనపైనే దృష్టిపెట్టాలని నిర్ణయించుకున్నారని, ఈ నేపథ్యంలో వారిమధ్య విభేదాలు తలెత్తాయని బాలీవుడ్‌లో మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తల పై ఇప్పటివరకు ఈ జంట పెదవి విప్పలేదు. ఇద్దరిలో ఎవరో ఒకరు స్పందిస్తేనే అసలు వాస్తవం ఏమిటో తెలుస్తుందని, అంతవరకు ఈ వార్తలను గాసిప్స్‌గానే భావించాలని అభిమానులు అనుకుంటున్నారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో 'ఓదెల-2' సినిమాలో నటిస్తున్నది.

డిసెంబర్ నుంచి 'దేవర-2'

ఓ వైపు 'వార్ 2'.. మరోవైపు ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్) సినిమాలతో బిజీబిజీగా ఉన్నారు తారక్. 'వార్ 2' ఈ ఏడాది ద్వితీయార్థంలో విడుదల కానుంది. ఇక ప్రశాంత్‌నీల్ సినిమా అయితే.. విడుదల వచ్చే ఏడాదే. ఇదిలావుంటే.. ఈ ఏడాది చివరి నుంచి 'దేవర 2'కు కూడా తారక్ డేట్స్ ఇచ్చేశారని ఫిల్మ్ వర్గాల టాక్. అందుకే.. ప్రశాంత్‌నీల్ సినిమాకు సంబంధించిన తన వర్క్ మొత్తాన్ని డిసెంబర్‌లోపు కంప్లీట్ చేయాలనే సంకల్పంతో తారక్ ముందుకెళ్తున్నారట. దీనికి సంబంధించి, ప్రశాంత్‌నీల్‌తో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారట. డిసెంబర్‌లోపు 'డ్రాగన్' సినిమాకు సంబంధించిన తన పార్ట్‌ని కంప్లీట్ చేసి, 'దేవర2' సెట్‌లోకి ఎంట్రీ ఇస్తారట ఎన్టీఆర్. ప్రస్తుతం దర్శకుడు కొరటాల శివ 'దేవర 2' స్క్రిప్ట్ వర్క్, ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నట్టు తెలుస్తున్నది. డిసెంబర్ కల్లా 'దేవర 2' షూటింగ్ మొదలుపెట్టేందుకు సర్వసన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సెకండ్ పార్ట్‌లో కథానాయిక జాన్వీ కపూర్ పాత్ర కీలకంగా ఉంటుందని తెలుస్తున్నది. అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.

హృదయాన్ని కదిలిస్తుంది

మరాఠీ యోధుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా రూపొందిన 'ఛావా' చిత్రానికి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తున్నది. విక్కీ కౌశల్, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్ నిర్మాత. ఈ సినిమా వసూళ్లు 700కోట్లకు చేరువవుతున్నాయి. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ తెలుగులో విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు వెర్షన్ రిలీజ్ సందర్భంగా హీరో విక్కీకౌశల్ ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సినిమా విడుదలైన మొదటివారం నుంచి తెలుగులో డబ్ చేయాలనే డిమాండ్స్ వచ్చాయని, గీతా ఆర్ట్స్ సంస్థ రిలీజ్ చేయడం ఆనందంగా ఉందని, శంభాజీ మహారాజ్ అసమాన త్యాగాన్ని ఆవిష్కరిస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్ని కదిలిస్తుందని విక్కీ కౌశల్ వీడియోలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 550 స్క్రీన్స్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వెల్లడించింది.

మూడు తరాల కథ



హీరో శర్వానంద్ కథానాయకుడిగా ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నది. 'శర్వా36' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ సినిమాకు అభిలాష్ కంకర దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. త్వరలోనే టైటిల్‌ని ప్రకటించనున్నారు. గురువారం శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా, ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమాలోని శర్వా లుక్‌ను రివీల్ చేస్తూ ఓ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. టోర్న్ జీన్స్, స్టైలిష్ స్పోర్ట్స్ జాకెట్, షేడ్స్ ధరించి యమహా ఆర్ఎక్స్-100 బైక్‌పై కూర్చున్న శర్వాను ఈ లుక్‌లో చూడొచ్చు. ఈ పోస్టర్‌లో శర్వానంద్ కూల్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లో సవాలుతో కూడిన పాత్రను ఇందులో చేస్తున్నారని, ఉద్రేకపూరితమైన పోరాటాలతో అదరగొట్టనున్నారని, మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉంటుందని, ఇది మూడు తరాల కథ అని మేకర్స్ చెబుతున్నారు. మాళవిక నాయర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: జె.యువరాజ్, సంగీతం: గిబ్రాన్, నిర్మాతలు: వంశీ-ప్రమోద్.

నాన్‌స్టాప్ వినోదం

నయనతార ప్రధాన పాత్రలో రూపొందిన 'మూకుతి అమ్మన్' చిత్రం 'అమ్మోరు తల్లి' పేరుతో తెలుగులో విడుదలైన విషయం తెలిసిందే. ఆ సినిమాకి సీక్వెల్‌గా 'ముకుతి అమ్మన్ 2' తెరకెక్కనుంది. నయనతార లీడ్ రోల్ పోషిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి సుందర్.సి దర్శకుడు. వెల్స్ ఇంటర్నేషనల్, ఐవీ ఎంటర్టైన్మెంట్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. గురువారం చెన్నైలో ఈ సినిమాకోసం నిర్మిస్తున్న కోటి రూపాయల భారీ సెట్‌లో ఈ సినిమాకు సంబంధించిన పూజాకార్యక్రమాలు లాంఛనంగా జరిగాయి. చిత్ర యూనిట్‌తో పాటు టాలీవుడ్ నిర్మాతలు సునీల్ నారంగ్, జగదీష్. సి.కల్యాణ్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. 'మూకుతి అమ్మన్ 2' అన్ లిమిటెడ్ నవ్వులతో, ఎక్సయిటింగ్ కథాంశంతో రూపొందనున్నదని, నయన్‌నతార పాత్ర ఊహలకు అతీతంగా ఉంటుందని సుందర్.సి తెలిపారు. దునియా విజయ్, రెజీనా కాసాండ్రా, యోగిబాబు, ఊర్వశి, అభినయ, రామచంద్రరాజు, అజయ్‌ఘోష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: గోపీ అమర్‌నాథ్, సంగీతం: హిప్ హాప్ ఆది.

ఉత్కంఠను రేకెత్తించే వీర ధీర సూరన్2

చియాన్ విక్రమ్ నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ పాక్డ్ మూవీ 'వీర ధీర సూరన్ పార్ట్2'. ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకుడు. రియా శిబు నిర్మాత. ఎస్.జె.సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషార విజయన్ కీలక పాత్రధారులు. ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి స్పందన వస్తున్నదని, ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. తేని ఈశ్వర్, సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈచిత్రానికి జి.వి.ప్రకాష్‌కుమార్ దర్శకుడు. ఎన్వీఆర్ సినిమాస్ ద్వారా ఈ సినిమా తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

'రాబిన్‌హుడ్'తో ఆటపాట

'రొమాంటిక్' 'రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది కేతికాశర్మ. తెలుగులో ఈ భామ మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నది. తాజాగా ఈ సొగసరి నితిన్ 'రాబిన్‌హుడ్' చిత్రంలో ఓ ప్రత్యేక గీతంలో నర్తించనుంది. వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని మూడో గీతాన్ని ఈ నెల 10న రిలీజ్ చేయబోతున్నారు. ఈ పాటలో కేతికా శర్మ అల్ట్రా గ్లామరస్ అవతార్‌లో కనిపిస్తుందని, జీవీ ప్రకాష్ కుమార్ బాణీ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'రాబిన్‌హుడ్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని, మ్యూజికల్‌గా ఈ సినిమా అందరిని అలరిస్తుందని చిత్రబృందం పేర్కొంది. శ్రీలీల, రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: వెంకీ కుడుముల.

బాలీవుడ్‌కు గుడ్‌బై

అగ్ర దర్శకుడు, నటుడు అనురాగ్‌కశ్యప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను బాలీవుడ్ ఇండస్ట్రీని వదిలివేస్తున్నట్లు ఆయన తెలిపారు. హిందీ చిత్రసీమ కేవలం బాక్సాఫీస్ వసూళ్లపైనే దృష్టిపెడుతున్నదని, సృజనాత్మక స్వేచ్ఛ పూర్తిగా హరించుకుపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాలీవుడ్ పరిశ్రమ మొత్తం విషపూరితంగా మారిపోయిందని గత ఏడాది ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అనురాగ్‌కశ్యప్ వ్యాఖ్యానించారు. అప్పటి నుంచే ఆయన బాలీవుడ్‌ను వీడే ప్రయత్నాల్లో ఉన్నారని అర్థమైంది. త్వరలో ఆయన బెంగళూరుకు వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని, అక్కడే స్థిరపడతారని తెలుస్తున్నది. బాలీవుడ్‌లో ప్రతీ ఒక్కరూ భారీ లక్ష్యాలను ఎంచుకొని సినిమాలు తీస్తున్నారని, ప్రతిభకు ఏమాత్రం అవకాశం లేకుండా పోయిందని అనురాగ్ కశ్యప్ పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సైతం ఆయన బాలీవుడ్ ఇండస్ట్రీపై విమర్శలు చేశారు. సినిమాలు తీస్తానంటే ముంబయి నిర్మాతలు తనను నమ్మడం లేదని, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం దక్షిణాది ఇండస్ట్రీకి వెళ్లిపోతున్నానని ఆయన తెలిపారు.

'మిస్టర్ రెడ్డి' ప్రేమాయణం

టీఎన్ఆర్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'మిస్టర్ రెడ్డి'. వెంకట్ వోలాద్రి దర్శకుడు. టీఎన్ఆర్, మహాదేవ్, అనుపమ ప్రకాష్, దీప్తి, భాస్కర్ ప్రధాన పాత్రల్ని పోషించారు. గురువారం టీజర్‌ను తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ విడుదల చేశారు. చిన్నతనంలో విడిపోయిన ప్రేమజంట, పెద్దయ్యాక మళ్లీ కలుసుకొని ప్రేమ కోసం ప్రయత్నిస్తే ఎలా ఉంటుందన్నదే ఈ సినిమా ఇతివృత్తమని దర్శకుడు తెలిపారు. కొత్తవాళ్లందరూ కలిసి చేసిన ఈ ప్రయత్నాన్ని అందరూ ప్రోత్సహించాలని హీరో టీఎన్ఆర్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: కె.ఎన్.భూషణ్, సంగీతం: కేఎస్ఆర్ మ్యూజికల్, రచన-దర్శకత్వం: వెంకట్ రెడ్డి వోలాద్రి.

ప్రయాణమే ముఖ్యం ఫలితాలు పట్టించుకోను..

'జయాపజయాలు నన్ను ప్రభావితం చేయలేవు. వాటి కారణంగా ఆనందంగా లేనని, బాధపడనని నేననను. కానీ అది ఆ క్షణం వరకే. ఫలితం ఏదైనా మరింత ఉత్సాహంగా ముందుకు సాగడమే నాకు తెలుసు.' అని అలియా భట్ అన్నారు. గత ఏడాది విడుదలైన ఆమె 'జిగ్రా' సినిమా పెద్దగా ఆడలేదు. ఈ ఫలితంపై అలియా కూడా ఇప్పటివరకూ స్పందించలేదు. రీసెంట్‌గా 'జిగ్రా' గురించి ఆమె మాట్లాడారు. 'నాకు నటన అంటే ఇష్టం. సినిమా అంటే ప్రాణం. అందుకే ఓ వైపు నటిస్తూ, మరో వైపు నిర్మాతగా కూడా కొనసాగుతున్నా. సినిమాకు సంబంధించి నాకు ఎన్నో కలలు ఉన్నాయి. వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడుతూనే ఉంటా. ఈ క్రమంలో ఎలాంటి ఫలితాలు వచ్చినా పట్టించుకోను. గత ఏడాది 'జిగ్రా' సినిమా చేశాను. నిజానికి అది నా డ్రీమ్ ప్రాజెక్ట్. కొత్తగా ప్రయత్నించాను. దర్శకుడు వాసన్ బాలా కూడా బాగానే తీశారు. కానీ ఫలితం మాత్రం వేరేగా వచ్చింది. కానీ నిరాశపడలేదు. మరింత ఉత్సాహంతో ముందుకెళ్తున్నా.' అని చెప్పారు అలియా భట్.